క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ టీచర్స్‌కాలనీ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా మంగళవారం రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు టీచర్స్‌కాలనీ, హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని అప్పాజిజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శినికాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్‌ఎఫ్‌టీ బ్లాక్స్ వరకు పైన పేర్కొన్న సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్ అందజేత



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తు చనిపోయిన కానిస్టేబుల్ కుటుంబానికి న్యూ ఇండియా అస్యూరెన్స్ లిమిటెడ్ తరఫున వచ్చిన రూ.20.65,000 లక్షల చెక్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా సోమవారం తన కార్యాలయంలో అందజేశారు. విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్ దామోదరరావు గత ఏడాది సెప్టెంబర్ 2న ప్రమాదవశాత్తు కాంపౌండ్ వాల్ కూలి దాని కింద పడి మరణించారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ప్రత్యేకంగా గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ కింద ప్రమాదవశాత్తు మరణించిన పోలీస్‌కు వారి కుటుంబానికి ప్రమాద బీమా రూ.20లక్షలు, మృతదేహ రవాణా ఖర్చుల కింద రూ.40వేలు, మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు చెల్లిస్తారు. ఈ మేరకు న్యూ ఇండియా అస్యూరెన్స్ లిమిటెడ్ ప్రతినిధులు కమిషనర్ టీకే రాణా చేతుల మీదుగా కానిస్టేబుల్ దామోదరరావు సతీమణి త్రివేణికి చెక్ అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, ఏఓ రంగారావు, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ అధికారులు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక సరోజినీనాయుడు



లబ్బీపేట(విజయవాడతూర్పు): భారత కోకిలగా ప్రసిద్ధిగాంచిన సరోజినీనాయుడు మహిళా చైతన్యానికి, స్వతంత్ర వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచారని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అన్నారు. సరోజినీ నాయుడు గొప్ప రచయిత్రి, ఉపన్యాసకురాలు, స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న గొప్ప దార్శనిక నేతల్లో ఆమె ఒకరని కొనియాడారు. సరోజినీనాయుడు జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం నలంద డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ ర్యాలీ నిర్వహించారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రెడ్‌సర్కిల్ వరకూ నిర్వహించిన ఈ ర్యాలీలో కేడెట్లు ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. అనంతరం జాతీయ మహిళా దినోత్సవం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రా బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ నవీన్‌కుమార్ రాయ్, హవల్దార్ అప్పారావు, నాయక్ కుందన్‌కుమార్, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ ఎస్‌కే రఫియాబేగం పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాల్లోనూ రాణించాలని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ రాజు డేవిడ్ పేర్కొన్నారు. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలోత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం స్కూల్‌లో అభినందనలు తెలిపారు. సెయింట్ థామస్ స్కూల్ విద్యార్థులు 13 అంశాల్లో రాణించారన్నారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో ఎస్.జోషిత ప్రథమ స్థానం, నీతి పద్యం విభాగంలో షేక్ ఆజాద్ తృతీయ స్థానం, హ్యాండ్ రైటింగ్‌లో సీహెచ్ హర్షవర్ధన్ ద్వితీయ స్థానం, పరుగు పందెంలో సబ్ జూనియర్ కేటగిరిలో షేక్ సుభానీ, గోనె సంచుల విభాగంలో వరుణ్‌కుమార్, సూదిదారం విభాగంలో పీ కుసుమ నాగసాయి ద్వితీయ స్థానం, జానపద గేయం విభాగంలో ఎల్. శరణ్య, పీ కుసుమ నాగసాయిశ్రీలు తృతీయ స్థానం, ఆర్.చరత్ చంద్, చంద్రశేఖర్, పరుగు పందెంలో పీ రాజేష్, గోనెసంచుల విభాగంలో జీ దుర్గాగణేష్ తృతీయ స్థానం సాధించారన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా విజయవంతం చేయాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం)లో స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికను వెలంపల్లి శ్రీనివాసరావు తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు పని చేయాలని కోరారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి మాట్లాడుతూ శుభకృత్ నామ సంవత్సర మాఘ బహుళ దశమి తత్కాల ఏకాదశి ఫిబ్రవరి 16 నుంచి పాల్గుణ శుద్ధ చవితి 23వ తేదీ వరకూ స్వామి వారి కల్యాణ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 16న స్వామిని పెళ్లికుమారునిగా చేస్తామని పేర్కొన్నారు. అలాగే స్వామి వారి ఉత్సవాల ధ్వజారోహణం ఉంటుందన్నారు. 17న స్వామికి విశేష కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే సాయంత్రం విశ్వబ్రాహ్మణ సంఘం వారిచే గ్రామోత్సవం ఉంటుందన్నారు. 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజాము రెండున్నర గంటల నుంచి స్వామి వారికి అభిషేకాలు ఉంటాయన్నారు. అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కల్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 19వ తేదీన శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ వారిచే రథోత్సవం, 20న పూర్ణాహుతి, 21న పుష్పయాగం, ద్వాదశ ప్రదక్షిణలు, 22న పవళింపుసేవ తదితర కార్యక్రమాలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు పణుకు ఫణీంద్ర, అర్చకులు సుమంతశర్మ పాల్గొన్నారు.

తలశిల రఘురామ్‌ను పరామర్శించిన వైఎస్ విజయమ్మ



రఘురామ్‌ను పరామర్శిస్తున్న విజయమ్మ



తలశిల రఘురామ్‌ను, కుమార్తె ప్రణవను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ పరామర్శించారు. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విజయమ్మ సోమవారం సాయంత్రం విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వచ్చిన ఆమె తొలుత స్వర్ణకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రఘురామ్‌ను ఓదార్చి సాంత్వన సంభాషణలతో మనోధైర్యాన్ని కల్పించారు. తమ కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ఉన్న రఘురామ్ సతీమణి అకాల మరణం పొందటం దురదృష్టకరమని బాధాతప్త హృదయంతో అన్నారు. తమ కుటుంబం ఎప్పుడూ రఘురామ్ కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రఘురామ్ కుమార్తె ప్రణవ, సోదరులు దూళిపాళ శ్రీకాంత్, శ్రీనాథ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా రఘురామ్ ఇంటికి వచ్చి స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రఘురామ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా ఉదయం నుంచి పలువురు మంత్రులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు వచ్చి రఘురామ్‌ను పరామర్శించి వెళ్లారు.

పెరియార్ ఆలోచనలు పీడిత వర్గాలకు స్ఫూర్తి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



'పెరియార్ రీడర్' పుస్తకావిష్కరణలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సుప్రసిద్ధ నాస్తిక ఉద్యమ నేత పెరియార్ ఆలోచనలు పీడిత వర్గాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. హెచ్‌బీటీ సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన 'పెరియార్ రీడర్' పుస్తకావిష్కరణ విజయవాడ పుస్తకమహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై సోమవారం రాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మంచిచెడులపై చర్చ జరిగినప్పుడు సమాజానికి మేలు చేసే మేలు చేసే భావాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. అంతే తప్ప తమ పూర్వీకులు పూర్వం ఏదో చెప్పారని, మార్పును ఆమోదించకుండా ముందుకు సాగడం మంచి పద్ధతి కాదన్నారు. పెరియార్ గాంధీజీ బోధనలకు ప్రభావితమై ఆయనతో ప్రయాణం చేశారన్నారు. పెరియార్ ద్రవిడ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడమే కాకుండా దక్షిణ భారతదేశ ప్రత్యేకతను ఎలుగెత్తి చాటారన్నారు. ఆయన భావాలకు సంబంధించిన సాహిత్యం మరింతగా ప్రజల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ పాత్రికేయుడు కే శ్రీనివాసు మాట్లాడుతూ దేశంలో సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో పెరియార్ ఒకరన్నారు. దళితబహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు కొరివి వినయకుమార్ మాట్లాడుతూ పెరియార్ రీడర్ పుస్తకంలో అంటరానితనం, రామాయణం, స్త్రీలు గౌరవించే వివాహాలతో బానిసత్వం, సమాజ వ్యక్తిత్వం తదితర అంశాలకు సంబంధించిన వ్యాసాల సంపుటి అన్నారు. ద్రవిడ ఉద్యమాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లిన ఉద్యమనేత పెరియార్ అన్నారు. దక్షిణ భారత ఉనికి కోసం ఉద్యమించారన్నారు. సభలో రచయిత విల్సన్, హెచ్‌బీటీ సంస్థ ప్రచురణకర్త గీతారామస్వామి, రచయిత బండారు సురేష్ పాల్గొన్నారు.

ఏపీకి చేసిన ద్రోహంపై బీజేపీ లెంపలేసుకోవాలి

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు ముందుగా బీజేపీ ప్రభుత్వం ఏపీకి చేసిన ద్రోహంపై లెంపలేసుకోవాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఐదేళ్లు కాదు పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని పార్లమెంట్ సాక్షిగా చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఆ మాటను ఎందుకు నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్ర సహాయ మంత్రి దేవుసిన్హా యౌహాన్‌కు కనీసం ఏపీ రూపురేఖలు, నైసర్గిక స్వరూపం గురించి కూడా తెలియని వ్యక్తి అని చివరకు ఆయన కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మీద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విభజన చట్టం లోని అంశాలను ఎందుకు అమలుచేయడం లేదు, పోలవరం ప్రాజెక్టుకు సకాలంలో నిధులు ఎందుకు ఇవ్వడం లేదు, ఆంధ్రుల హక్కైన విశాఖ ఉక్కును ఎందుకు ప్రైవేటీకరిస్తున్నారో కేంద్రమంత్రి చౌహాన్, బీజేపీ నాయకులు సత్యకుమార్, జీవీఎల్ నరసింహారావులు సమాధానం చెప్పాలని నిలదీశారు. యావత్ దేశానికి ఆదర్శ పాలనను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓ వైపు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇస్తుంటే మరో వైపు ఆ ప్రభుత్వ మంత్రులు, నాయకులు ఇలా నిస్సిగ్గుగా విమర్శలు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సత్యకుమార్ చెప్పేవన్నీ అసత్యాలే అని, జీవీఎల్‌కు కనీస జ్ఞానం కూడా లేదని ఇకనైనా బీజేపీ నాయకులు వ్యక్తిగత అజెండాతో పని చేయడం మానుకోవాలని లేకపోతే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో చీఫ్ కోచ్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఒంగోలు ఫేస్ ఎస్‌ఆర్ ఒలింపియాడ్ స్కూల్లో ఈ నెల 12న ఇంటర్ డిస్ట్రిక్ట్ షోటోకాన్ కరాటే పోటీల్లో విజయవాడకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని బహుమతులను సాధించారు. కుమితే (ఫైట్) విభాగంలో అండర్–14 బాలురు ఎస్.అనిల్‌కుమార్ (గోల్డ్), ఎ.ఈశ్వర్ ఆదిత్య(సిల్వర్), టీ గణేష్ (సిల్వర్), వీ తులసీకుమార్ (బ్రాంజ్), అన్వర్ బాషా(బ్రాంజ్) మెడల్స్ సాధించారు. అలాగే కటా (ఫామ్స్) అండర్–14 గరల్స్ కోటాలో పీ శివపార్వతి (గోల్డ్), బాలుర కటాలో టీ నవదీప్(సిల్వర్), టీ విజయ్ (బ్రాంజ్) మెడల్స్ దక్కించుకున్నారు. భాష్యం స్కూల్ విద్యార్థినులు బాలికల అండర్–12 విభాగంలో ఎస్ రిష్మిత లక్ష్మి(బ్రాంజ్), అండర్–12 బాలుర విభాగంలో ఎస్ రోహిత్(గోల్డ్), ఎన్ జోషి హర్ష(సిల్వర్), ఎస్‌కె నజీర్ హుస్సేన్(సిల్వర్), ఎండీ సుహాయిల్(సిల్వర్), పీ అద్వైత్(సిల్వర్), జీ సాకేత్(బ్రాంజ్), ఎమ్ రిషికేశవ్ చౌదరి(బ్రాంజ్), పీ సాయి నిఖిలేష్‌రెడ్డి (బ్రాంజ్), వీ జయంత్(బ్రాంజ్) మెడల్స్ సాధించారు. కాగా కటా విభాగంలో ఎంఎస్‌ఆర్ స్కూల్ విద్యార్థి కొడాలి గౌతమ్ (బ్రాంజ్), 18 ఏళ్ల వయసుకుపైన ఫిమేల్ కటాలో ఎస్ఎల్ దివ్య గాయత్రి (గోల్డ్) మెడల్స్ సాధించారు. టోర్నమెంట్ చీఫ్ జడ్జిగా రాపోలు సుదర్శన్ వ్యవహరించారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఏపీ చీఫ్ ఇనస్ట్రక్టర్ కొడాలి రవిబాబు, కొడాలి సాగరిక (జోనల్ చీఫ్ ఇనస్ట్రక్టర్)లను టోర్నమెంట్ ఆర్గనైజర్ టీ శ్రీనివాసరెడ్డి సత్కరించారు. విద్యార్థుల విజయంపట్ల ఆయా పాఠశాలల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

అనువాద సాహిత్యం విస్తృతం కావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తెలుగునాట అనువాద సాహిత్యం మరింత విస్తృతం కావాల్సిన అవసరముందని ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వాడ్రేవు చినవీరభద్రుడు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా గొల్లపూడి సాహితీవేదికపై అనువాదన సాహిత్యంపై సదస్సును సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా చినవీరభద్రుడు మాట్లాడుతూ అనువాదాలు అధికంగా వచ్చినప్పుడు సాహిత్యం మరింత పరిపుష్టమవుతుందన్నారు. అనువాద సాహిత్య సృజనకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. తెలుగునాట తొలి కవిత్రయమే అనువాదమన్నారు. కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు మాట్లాడుతూ అనువాదాలు జరిగినప్పుడే భాష మరింత విస్తృతమవుతుందన్నారు. అంతేకాకుండా ఐకమత్యం సాధ్యమవుతుందన్నారు. సభకు సొసైటీ సభ్యుడు గోళ్ల నారాయణరావు అధ్యక్షత వహించారు.

18న విశ్వేశ్వర స్వామికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శమీ, గంగా, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు పేర్కొన్నారు. 18వ తేదీ శనివారం తెల్లవారుజాము నుంచి స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, సాయంత్రం ఆరు గంటలకు ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కల్యాణ మండపంలో స్వామి కల్యాణోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సుదురుపాటి ప్రసాద్ శర్మ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్దాల మండపాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఎయిమ్స్‌కు బస్సు నడపాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేవీనగర్ నుంచి సాంబమూర్తి రోడ్డు మీదుగా మంగళగిరి ఎయిమ్స్‌కు సిటీ బస్సు నడిపాలని సోమవారం స్పందనలో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ స్థానికులతో కలిసి విజ్ఞప్తి చేశారు. గతంలో తాము స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిమ్స్‌కు సిటీ బస్సు ఏర్పాటు చేశారని, తరువాత దేవీనగర్‌లో రోడ్డు బాగాలేదని బస్సు సర్వీసు నిలిపివేశారని పేర్కొన్నారు. ఇప్పు డు రోడ్డు బాగానే ఉండటంతో సర్వీసు పునరుద్ధరించాలని కోరారు.

17 నుంచి వీఎంసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులకు ఈ నెల 17 నుంచి 19 వరకు వీఎంసీ స్పోర్ట్స్ మీట్ – 2023 నిర్వహిస్తున్నమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో అధికారులతో కలసి లాటరీ విధానంలో జట్లను ఎంపిక చేశారు. ఇందులో మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయని, వాటిలో మేయర్ జట్టు, కమిషనర్, మున్సిపల్ రెవెన్యూ, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యు.సి.డి, ఎడ్యుకేషన్, రెవెన్యూ (వి.ఆర్.ఒ), మహిళా పోలీస్ జట్లు పాల్గొంటున్నాయని ఆమె అన్నారు. ఆయా జట్లకు 100 మరియు 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 400 మీటర్ల నడక, షార్ట్ పుట్, షటిల్ బ్యాట్‌మెంట్, క్రికెట్, వాలీబాల్, కబాడీ, టెన్నిస్, చెస్, త్రో బాల్, టెన్నీ కాయిట్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డి.ఎఫ్.ఒ శ్రీనివాస్, అదనపు కమిషనర్ (జనరల్) ఎం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ప్రభాకర రావు, సిటి ప్లానర్ జి.వి.జి.ఎస్.వి ప్రసాద్, డెప్యూటీ సిటీప్లానర్ (ప్లానింగ్) జుబిన్ శిరన్ రాయ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డెప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ



కూరగాయలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి విజయభారతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన అధికారులను, స్పందనకు వచ్చే ప్రజలను ఆకర్షిస్తోంది. వీటికి గిరాకీ అంతేస్థాయిలో ఉంది. స్పందనకు వచ్చిన అధికారులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం రోజు కలెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నారు. ఆ రోజు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల ఉత్పత్తులతో డీపీఎం ఆధ్వర్యాన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు (ఆపిల్‌బేర్ – జామ) పప్పులు, నూనెలు, బెల్లం, రైతు బుట్ట (నెలకి అవసరమగు ఉత్పత్తులు)లను కొనుగోలు చేశారు.రైతులను జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎం. విజయభారతి, తదితరులు అభినందించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మందులు క్రమం తప్పకుండా వాడడంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా క్షయ వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికీ పౌష్టికాహార కిట్లను అందించి, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా ఆరు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తగ్గకుండా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను అశ్రద్ధ చేయకుండా వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలకు తోడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ప్రాణాంతకమైన అంటువ్యాధి అయిన క్షయ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. పౌష్టికాహారన్ని తీసుకుని వ్యాధిగ్రస్తులు త్వరితగతిన కోలుకుని ఆరోగ్యవంతులు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమకూర్చిన 16 డిజిటల్ హిమోగ్లోబిన్ ఎనలైజర్లను వార్డు హెల్త్ సెక్రటరీలకు కలెక్టర్ ఢిల్లీరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రెహమాన్, కార్యదర్శి డాక్టర్ మనోజ్, జిల్లా టీబీ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టాలి



మూడుదశాబ్దాల తరువాత కలిసిన చార్టర్డ్ అకౌంటెంట్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ డీ సూర్యనారాయణ స్ఫూర్తితో వృత్తి నైపుణ్యాలకు మరింత పదును పెట్టాలని టీసీఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ డీ విజయకుమార్ అన్నారు. డీ సూర్యనారాయణ అండ్ కంపెనీ వ్యవస్థాపకులు, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ సూర్యనారాయణ సంస్మరణ సభ, శిష్య ప్రశిష్య కలయిక కార్యక్రమాన్ని కేబీఎస్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విజయకుమార్ మాట్లాడుతూ సూర్యనారాయణ శిష్యప్రశిష్యులు సుమారు రెండు వేల మంది చార్టర్డ్ అకౌంటెంట్లుగా ప్రపంచ వ్యాపితంగా సేవలందిస్తున్నారన్నారు. సుమారు మూడు దశాబ్దాల తరువాత అందరూ కలిసి తమ గురువును స్మరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు ఎం.కృష్ణమూర్తి, కొంకిమళ్ల శ్యామ్, చక్రవర్తి, రామకృష్ణ, కేబీఎస్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు పాల్గొన్నారు. తొలుత సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సమాజానికి రోటరీ విస్తృత సేవలు



కుష్టువ్యాధి గ్రస్తులకు చెప్పలను అందిస్తున్న బాయన బాబుజీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సమాజానికి విస్తృతమైన సేవలందిస్తుందని ఆ సంస్థ అధ్యక్షుడు బాయన బాబుజీ(బాబ్జీ) అన్నారు. కుష్టు వ్యాధి వారోత్సవాలను పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులకు చెప్పుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యా, వైద్య, సామాజిక సేవారంగాలకు రోటరీ పలు రకాల సేవలందిస్తుందన్నారు. క్లబ్ స్వర్ణోత్సవాలను జరుపుకుంటున్న తరుణంలో కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామన్నారు. కార్యదర్శి సుంకర నాగభూషణం, సభ్యులు మోహనరావు, తిరుమల విశ్వేశ్వరరావు, ఎండీ అమానుల్లా, మురళీకృష్ణ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, మహా మండపం, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం విద్యుత్‌దీపాలను వెలగించి పరిశీలించారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన మహా శివుని ప్రతిరూపం నగరంలోని పలు ప్రాంతాల నుంచి దర్శనమిస్తుంది. శివరాత్రి రోజున స్వామి దర్శనానికి ఆలయ ఏర్పాట్లు చేస్తున్నారు.